
**టెలిఫోన్ డిపార్ట్‌మెంటువారు రేట్లు తగ్గించేశారట!**
**ఎక్కడ చూసినా చర్చ. ఎవరి నోట విన్నా ఇదే మాట.**
**ఇంతకీ తగ్గించిన రేట్లు ట్రంక్ కాల్స్‌కో, లోకల్ కాల్స్‌కో కాదు, కొత్తగా టెలిఫోన్ కనెక్షన్ తీసుకునేటప్పుడు కట్టవలసిన డిపాజిట్టు తగ్గించారు. ప్రతి రెండు నెలలకీ కట్టవలసిన రెంట్ (అద్దె) తగ్గించారు.**

సాధారణంగా ఏ రంగంలోనైనా రేట్లు పెంచడం రివాజు కానీ, తగ్గించటం ఎప్పుడూ కనపడదు. టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌లో అయితే పెంచుకుంటూ పోవటమే గానీ తగ్గించటం అసలుండదు. అలాంటిది టెలిఫోన్ డిపార్టుమెంటే ఇప్పుడు రేట్లు తగ్గించింది. తగ్గించటంలో ఇలా



అలా కాదు, గణనీయంగా తగ్గించేసింది.

ఇంకేముంది, అవసరం ఉన్నవాళ్లూ, లేనివాళ్లూ ఎగబడిపోవటమున్నూ, పోటీలు పడి అప్లికేషన్లు పెట్టేయ్యటమున్నూ అట! నాకు తెలిసిన ఇద్దరు ముగ్గురు అప్పుడే అప్లికేషన్లు పెట్టేయయ్యటమే కాదు, నన్నూ హెచ్చరించారు "త్వరపడండి. ప్రభుత్వంవారు మనసు మార్చుకుని, తగ్గించినదానికి రెట్టింపు రేట్లు పెంచేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు!" అని. దాంతో నాకూ కంగారు పుట్టింది.

మా ఇద్దరబ్బాయిల్లో ఒకడు హైదరాబాదులోనూ, మరొకడు విశాఖపట్నంలోనూ ఉంటున్నారు. అమ్మాయీ, అల్లుడూ బెంగుళూరులో ఉంటున్నారు. ముప్పై అయిదేళ్లపాటు ప్రభుత్వోద్యోగం చేసి ఇటీవలే రిటైరై, భార్యా సమేతంగా స్వగ్రామంలో స్వగృహంలో ఉంటున్నాను నేను. వాళ్ల సొంతమైతే నేమి, ఉద్యోగ హోదావల్ల వచ్చినవైతే నేమి మా ముగ్గురు పిల్లల ఇళ్లల్లోనూ టెలిఫోన్ లున్నాయి. మా ఇంట్లో ఫోను లేక పోవటం వల్ల మా వాళ్లెప్పుడైనా మాట్లాడాలంటే అవకాశం ఉండటం లేదు. నేను మాట్లాడాలన్నా ఏ ఎస్టీడీ బూతుకో పోవాల్సివస్తోంది. అదే ఇంట్లో ఫోనుంటే రాత్రి వేళ ఎంచక్కా పావు రేటు సమయంలో హాయిగా మాట్లాడుకోవచ్చు. మా శ్రీమతి కూడా పిల్లలతోనూ, మనవలతోనూ మాట్లాడొచ్చు. అందుకనే ముగ్గురు పిల్లలూ ఇంట్లో ఫోను పెట్టించమని చాలాకాలంగా ఒత్తిడి చేస్తున్నారు.

మొత్తం మీద టెలిఫోన్ అవసరం మాకుంది. పెట్టించుకోవాలన్న ఆలోచనా ఉంది. కేవలం నా అశ్రద్ధ వల్ల రోజులు గడిచిపోతున్నాయి. అంతా మన మంచికే అన్నట్టు ఇప్పుడు రేటు కూడా తగ్గింది. పైగా, మా ఇద్దరబ్బాయిల నుంచి ఉత్తర బాణా లొచ్చేసినాయి - ఇప్పటికైనా బద్ధకం వదిలి వెంటనే ఫోన్ కనెక్షన్‌కు దరఖాస్తు పెట్టమని! ఇంక తప్పే దేముంది? ఒకానొక సోమవారం ఉదయం పది గంటల సమయంలో బయలుదేరి తిన్నగా టెలిఫోన్ ఎక్స్ఛేంజి దారి పట్టాను. ప్రధాన ద్వారం దగ్గర వాచ్‌మన్ ఎవరూ కనపడలేదు. రెండడుగులు లోపల కేశాను. ఈలోగా లోపల్నుంచి ఒక వ్యక్తి ఎదురొచ్చి "ఏం కావాలి?" అంటూ నన్ను నిలేశాడు.

ఒక్కసారి అతని వాలకం పరిశీలించాను. యూనిఫారంలో లేడు. నాకు తెలిసినంత వరకు టెలి కమ్యూనికేషన్స్‌లో పనిచేసే నాల్గవ తరగతి ఉద్యోగులకీ, లైన్ స్టాఫ్‌కీ యూనిఫారం ఉంటుంది. ద్వారపాలకుడు నాల్గవ తరగతిలోకే వస్తాడు గనుక అతనికీ యూనిఫారం ఉండాలి. అయితే, యూనిఫారం తమ ఉద్యోగ స్థాయిని బహిరంగపరుస్తుంది కనుక చాలామంది దాన్ని ధరించటానికి సుముఖంగా ఉండరు. పైవాళ్లు కూడా అంతగా పట్టించుకోరు. ఇంచుమించు అన్ని డిపార్టుమెంటుల్లోనూ ఇదే పరిస్థితి - ఒక్క పోలీసు డిపార్టుమెంటు మాత్రం ఇందుకు మినహాయింపు.

ఇంతకీ నన్ను నిలేసిన వ్యక్తి యూనిఫారంలో లేకపోయినా అతని మాటల్లో ధ్వనించిన దర్పాన్నిబట్టి తప్పకుండా ద్వారపాలకుడే అయ్యుంటాడని నే నూహించాను. ద్వారపాలకులంటే సామాన్యులా? అందునా ప్రభుత్వ కార్యాలయాల ద్వారపాలకులు? సనక సనందాదులవంటి మహిమాన్వితులైన మహర్షులనే వైకుంఠద్వారం వద్ద జయ విజయులు నిలిపివేసిన కథను పురాణాలు చెపుతున్నాయి. జయ విజయులు మునులను నిలిపి వెయ్యటానికి ఏదో

ఒక కారణమైనా ఉంది. కానీ, ఇప్పటి ద్వార పాలకులు వాళ్లను మించిపోయారు. కారణం లేకుండానే అడ్డు పడిపోతున్నారు. మహర్షులు శాపానుగ్రహ శక్తిమంతులు కనుక తమను అడ్డుకున్న జయ విజయులను శపించి పారేశారు. మరి ఈ నాటి సామాన్య మానవులకు అలాంటి శక్తులేవీ లేవు కనుక ఏదో తమకు చేతనైన విధంగా పని జరుపుకుపోతున్నారు.

అతను ద్వారపాలకుడైనా, కాకపోయినా, నిలేసి అడిగాక సమాధానం చెప్పక తప్పదు కదా! "కొత్తగా టెలిఫోన్ పెట్టించుకోవాలి" అన్నాను.

ఏదో వినరాని మాట విన్నట్టు మొహం పెట్టాడతగాడు. ఎంతో ఆశ్చర్యం ప్రదర్శించాడు. పై నుంచి కిందికీ, కింద నుంచి పైకీ ఎక్స్‌రే చూపులతో నన్ను పరీక్షించాడు. అతని మనసులో ఏముందో తెలియకపోయినా, నన్నో తెలివి తక్కువ దద్దమ్మకింద లెక్కకట్టాడని మాత్రం అర్థం చేసుకోగలిగాను. అందుకు నిదర్శనంగా "ఇది టెలిఫోన్ ఎక్స్చేంజి!" అన్నాడతను ఇంచుక వ్యంగ్యం రంగరించి.

ఈసారి నే నాశ్చర్యపోవాల్సి వచ్చింది. అయితే, వెంటనే తేరుకోగలిగాను. అతని ధోరణి గ్రహించగలిగాను. ముప్పై ఐదేళ్ల ఉద్యోగానుభవం నాది. ముప్పైఐదేళ్ల వయసైనా నిండని కుర్రకుంక అతను. నా ముందా అతని కుప్పిగంతులు సాగేది?

సాధారణంగా వాదానికి దిగే మనస్తత్వం కాదు నాది. అయితే, అవతలవాడు ఒంటికాలు మీద ఓవర్ రైడ్ చెయ్యబోతే మాత్రం చూస్తూ ఊరుకోలేను. స్పీడ్ బ్రేకర్ వేసే తీరుతాను.


తా నేదో వ్యంగ్య సామ్రాట్ నని అతగాడు మురిసి పోతున్నట్టున్నాడు పాపం. తాడి తన్నే వాడి తలదన్నే వాడు కూడా ఉంటాడని కొంచెం హితవు చెప్పటం అవసర మనిపించింది నాకు.

"ఇది టెలిఫోన్ ఎక్స్చేంజి కాదని నే ననలేదే?" అతని బాణీలోనే అన్నాను.

గ్రహించాడు. అయినా ఓటమి వెంటనే అంగీకరిస్తాడా? అహం దెబ్బతినదూ!

# అప్లికేషన్ కొనేశానోచ్!

— చంద్రం —



"మ రిక్కడ కెందుకు రావటం?"

"చెప్పాను కదా, కొత్త టెలిఫోన్ కోసమని!"

"కొత్త టెలిఫోన్ కోసం రావాల్సిందిక్కడికి కాదు."

"మ రెక్కడి కెళ్లాలి?"

"సబ్ డివిజనల్ ఆఫీసు కెళ్లాలి."

"ఆ ముక్క ముందే చెప్తే సరిపోయేది కదా!"


అట్నుంచి సమాధానం లేదు.

కొత్తగా టెలిఫోన్ పెట్టించుకోవా లనుకుంటే ఎక్కడికి వెళ్లాలో, ఏం చెయ్యాలో సామాన్య ప్రజల కెలా తెలుస్తుంది? పేపర్లలో ప్రకటిస్తున్నారా? వీథుల్లో బోర్డులు పెడుతున్నారా? మైకుల్లో చెప్పిస్తున్నారా? టెలిఫోన్ పే రెత్తగానే ప్రధానంగా కనిపించేది టెలిఫోన్ ఎక్స్చేంజి. ఆ డిపార్టుమెంటుకు సంబంధించి ఏ పని పడినా ముందుగా ఎక్స్చేంజికే పరుగెత్తుకొస్తా రెవరైనా. తాము వచ్చిన పని చెప్పినప్పుడు తగిన సమాచారం అందించకుండా హేళనగా మాట్లాడడం, బాధ్యతా రహితంగా ప్రవర్తించటం ఆ డిపార్టుమెంటు ఉద్యోగులకు తగునా? అది క్షంతవ్యమా?

కర్టెసీ (మర్యాద) మీద అతనికో ఉపన్యాసం ఇవ్వాలనిపించింది. కానీ, వినే ఓపికా, ఉత్సాహం అతనిలో ఉన్న జాడే లేదు. కర్టెసీ అన్న పదానికి అతని నిఘంటువులో చోటున్నట్టే కనపడదు. ఉపయోగం ఉండదని తెలిసీ ఉపన్యాసం దంచటం చవిటినేలను సాగు చేసినట్టే అవుతుందని ఉత్సాహాన్ని బలవంతాన అణచుకుని, బుద్ధిగా వెనుతిరిగాను.

సబ్ డివిజనల్ ఆఫీసున్న చోటుతెలుసు నాకు. మరో విచిత్రమైన అనుభం·కోసం అటువైపు అడుగులు వేశాను.

మధ్య తరగతి కుటుంబీకులు ఎక్కువగా ఉండే వీథిలో రెండు




ఫామిలీ పోర్షన్ల డాబా ఇంట్లో ఉంది సబ్ డివిజనల్ ఆఫీసు. ఆఫీసుల కుండే హంగులేవీ అక్కడ కనిపించలేదు. గుమ్మం ముందు పాతిన రెండు టెలిఫోన్ స్తంభాలకు కట్టిన బోర్డును బట్టి అది ఫలానా ఆఫీసని తెలుస్తుంది.

సరే, లోపల కడుగుపెట్టాను. పోస్టాఫీసులోనూ, బ్యాంకుల్లోనూ ప్రతి కౌంటర్ ముందూ బోర్డు రాసి ఉంటుంది. ఎవ్వర్నీ అడక్కుండా కావాల్సిన కౌంటర్ దగ్గర కెళ్లి పని జరిపించుకోవచ్చు. ఇక్కడ కౌంటర్లూ లేవు, బోర్డులూ లేవు. కాస్సేపు తటపటాయించి, చివరికి ఓ కిటికీ దగ్గర్లో కూర్చుని ఉన్న ఓ ఆసామీ నుద్దేశించి, "బాబూ! కొత్తగా టెలిఫోన్ పెట్టించుకోవాలి" అని ఉపోద్ఘాతం ఎత్తుకున్నాను. అతగాడికి నా మాట వినిపించ లేదు. వినిపించలే దనటం కన్న వినిపించుకోలే దనటం సబబుగా ఉంటుందేమో! ఎందుచేత నంటే, దగ్గరగా ఉన్నా అతను తలెత్తలేదు. దూరంగా ఉన్న మరొకతను గబగబ బయట కొచ్చి, "టెలిఫోన్ అప్లికేషన్ ఫారం కోసం వచ్చారా?" అని సగౌరవంగా అడిగాడు.

ఉద్యోగుల్లోనూ మర్యాద తెలిసిన మనుషు లుంటారని నాకూ తెలుసు. అలాగని, తక్షణమే ఇతగాణ్ని ఆ జాబితాలో జమ చేసేసుకోవటం తొందరపాటు చర్య అవుతుందని నా పూర్వానుభవం హెచ్చరించింది. కొంత పరిశీలన జరిగిన తర్వాతనే ఇతను ఏ లిస్టులోకి చేరుతాడో తేల్చుకోవచ్చు లెమ్మనుకొని, అతనికి సమాధానం చెప్పాను -

"కొత్తగా టెలిఫోన్ పెట్టించు కోవాలి, బాబూ!"

"పోస్టల్ ఆర్డర్ తెచ్చారా?"

"పోస్టల్ ఆర్డర్ దేనికి?"

"కొత్తగా టెలిఫోన్ పెట్టించుకోవాలంటే ముందుగా అప్లికేషన్ పెట్టుకోవాలి. అప్లికేషన్ ఫారం డబ్బుకు అమ్మరు. పది రూపాయల విలువ గల ఇండియన్ పోస్టల్ ఆర్డర్ తెస్తేనే అప్లికేషన్ ఇస్తారు.' ' వివరించా డతను.

పోస్టల్ ఆర్డర్ కావాలంటే పోస్టాఫీసుకి వెళ్లాలి. అది టెలిఫోన్ ఎక్స్చేంజి పక్కనే ఉంది. అంటే మళ్లీ వెనక్కి వెళ్లాలన్నమాట!

"నగదు పనికిరాదా?"

"రూల్సు ఒప్పుకోవు కదండీ!" అన్నాడు చిన్నగా నవ్వుతూ అతను.

'హతోస్మి!' అనుకుంటూ వెనుదిరిగాను. "పోనీ ఒక పని చెయ్యండి" అన్నా డతను.

ఆశగా "ఏం చెయ్యమంటారు?" అన్నాను.

"నా దగ్గర పోస్టలార్డర్ ఉంది, తీసుకోండి."

బ్యాంకుల్లో డిమాండ్ డ్రాఫ్ట్ కున్నట్టే పోస్టలార్డర్‌కి కూడా కమిషన్ ఉంటుందని తెలుసు కానీ, పది రూపాలయకి కమిషనెంతో నాకు తెలియదు. అదే అతన్న డిగాను.

మొహమాటం లేకుండా చెప్పాడతను. "చూడండి మాస్టారూ! పది రూపాయలు పోస్టలార్డర్‌కి కమిషన్ అర్ధరూపాయి మాత్రమే. అయితే, ఆ రేటుకి నేనివ్వను. మీ రిప్పుడు పోస్టాఫీసు కెళ్లాలంటే ఐదు రూపాయలు రిక్షా కిరాయి అవుతుంది. రావటానికో అయిదు. అక్కడ క్యూలో నిలబడాలి. ఈ శ్రమంతా లేకుండా వెంటనే పని జరిగిపోవాలంటే నాకో ముప్పై రూపాయలివ్వండి, పోస్టలార్డర్ తీసుకోండి."

అతను నాపట్ల చూపిన మర్యాద వ్యాపార సంబంధమైందని తేలిపోయింది. కనుక ఇతన్ని మర్యాదస్తుల జాబితాలో చేర్చ నక్కరలేదు.

"ఆలోచించుకోండి" అనేసి, విసురుగా లోపలి కెళ్లిపోయా డతను.

పోస్టాఫీసుకు రానూ పోనూ పది రూపాయల రిక్షా కిరాయి చెల్లించాల్సిన అవసరం నాకు లేదు. సునాయాసంగా కాలి నడకన వెళ్లి, అరగంటలో పోస్టలార్డర్‌తో తిరిగొచ్చాను.

ఇందాకటి పెద్దమనిషి నన్ను చూసీ పట్టించుకోలేదు. అతని చెప్పిన రేటుకు పోస్టలార్డర్ అతని దగ్గర కొనలేదు కనుక నా మీద అలిగా డతను. అతని దృష్టిలో నేనో నేరస్తుణ్ని. ఇట్నుంచి అటూ, అట్నుంచి ఇటూ ఫైల్సు చేర వేస్తుండడంబట్టి అతని ఉద్యోగ స్థాయిని అర్థం చేసుకోగలిగాను. పిలిచినా అతను నాకు సహకరించడని తెలుసు కనుక, మళ్లీ కిటికీ ముందు చేరాను. చేతిలోని పోస్టలార్డర్ చూపిస్తూ, "అయ్యా! నా కో టెలిఫోన్ అప్లికేషన్ కావాలి" అన్నాను.

అతను తలెత్తలేదు.

వినిపించలేదేమో నని అవే మాటలు తిరిగి చెప్పాను. ఫలితం లేకపోయింది. ఒకవేళ చెవిటివాడేమో అన్న అనుమానం వచ్చి మూడోసారి కాస్త బిగ్గరగా పిలిచి అడిగాను.

విసిరుగా తలెత్తి, చిరాగ్గా నా వంక చూసి, "ఇక్కడ కాదు" అనేసి మళ్లీ తల దించేసుకున్నాడు. ఇంక కిటికీ బయటి నుంచి లాభం లేదని, తిన్నగా లోపల కెళ్లి అతని ముందు నిలబడి, "అయ్యా! నా కో టెలిఫోన్ అప్లికేషన్ కావాలండీ!' ' అన్నాను.

"ఇక్కడ కాదని చెప్పాను కదా! తెలుగు భాష అర్థం కాదా?"

ఎంత అమర్యాద? ముప్పై ఐదేళ్ల ఉద్యోగ జీవితంలో ఇలాంటి వాళ్లను చాలామందిని చూశాను. ఇలాంటి వాళ్లతో కలిసి పనిచేసిన అనుభవమూ ఉంది. అందువల్ల ఎదుర్కొన్న సమస్యలూ ఉన్నాయి. ఇతనికీ 'మర్యాద పాఠం' అవసరం ఉంది. కానీ, నే నొచ్చిన పని వేరు. వీళ్లకు మర్యాద పాఠాలు బోధించుకుంటూ కూర్చుంటే నా పని ఆగిపోతుంది. కానీ చిన్న చురక మాత్రం అంటించి చూశాను.

"అయ్యా! ఒక్క తెలుగు భాషేమిటండీ - ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, సంస్కృతం కూడా అర్థమవుతాయి నాకు. దయచేసి మీకు నచ్చిన భాషలో టెలిఫోన్ అప్లికేషన్ ఎక్కడిస్తారో చెప్తే,

జీవితాంతం మీకు కృతజ్ఞుడనై ఉండగలవాడను!' ' ఇదంతా ధారాళమైన ఉచ్చారణలో ఇంగ్లీషులో అన్నాను.

అదిరిపోయాడు గురుడు. నో రెత్తకుండా తల తిప్పి పక్కకి చూశాడు. నేనూ అటు చూశాను. అక్కడ కుర్చీ ఖాళీగా ఉంది.

''అతను లేడు'' అనేసి మళ్లీ తల దించేసుకున్నాడు.

"లేడంటే?"

వెకిలిగా నవ్వి, ''ఇంతకుముందే కదా బహుభాషా పండితుణ్నని సెలవిచ్చారు. లేడంటే అర్థం తెలియదా? లేడంటే లేడు - సీట్లో లేడని అర్థం" అన్నాడు.

"లే డనే మాటకి అర్థం నే నడగలేదు, బాబూ! లేడంటే ఏమయ్యాడూ అని నా ప్రశ్న. వచ్చాడా, రాలేదా? వస్తే ఏమయ్యాడు? రాకపోతే ఎందుకు రాలేదు? ఒకవేళ సెలవు గానీ పెట్టాడా? సెలవు పెడితే ఎన్ని రోజులు పెట్టాడు? అతను లేకపోతే ఇంకెవరూ ఇవ్వరా అప్లికేషన్లు? - ఇదీ నే నడుగుతున్నది.''

"ఆ వివరాలన్నీ నా కెలా తెలుస్తాయి?''

"మ రెవరికి తెలుస్తాయో అదైనా చెప్పండి. వారినే అడిగి తెలుసుకుంటాను. అవసరం నాది కదా!''

"ఆఫీసరు గారి నడగండి.''

"వా రెక్కడుంటారు?''

"ఎదురుగా బోర్డుంది. చూడండి.''

వెనక్కి తిరిగాను. గుమ్మానికి తెర వేలాడులోంది. గుమ్మంపైన గోడకి ఆఫీసరుగారి పేరూ, ఉద్యోగ హోదా తెలిపే బోర్డుంది. లేచి అటు నడిచాను. ఇందాక పోస్టలార్డర్ అమ్మజూపిన వ్యక్తి అడ్డుపడి, "ఆగండి" అన్నాడు.

ఆగి, "ఆఫీసరు గారిని కలవాలి" అన్నాను.

"ప నేమిటో చెప్పండి.''

"ఇక్కడే చెప్పాలా పని?''

"మా పద్ధతులు మా కుంటాయండి! మీ పేరూ, వచ్చిన పనీ కాగితం మీద రాసివ్వండి. లోపల చూపించి వస్తాను'' అన్నాడు.

పద్ధతులు బాగా తెలిసిన రిటైర్డు ఉద్యోగిని కనుక మూర్ఖంగా ప్రవర్తించలేకపోయాను. వెంటనే జేబులోనుంచి నా విజిటింగ్ కార్డు తీసి, దాని వెనక రెండు ముక్కలు రాసి అతని చేతి కిచ్చాను.

వెంటనే పిలుపొచ్చింది. లోపల కెళ్లాను.

మర్యాదగా కుర్చీ చూపించి కూర్చోమన్నారు ఆఫీసరుగారు. కూర్చున్నాక, "చెప్పండి" అన్నారు.

ఏం చెప్పగలను? జరిగిన దంతా మొర పెట్టుకుంటే ఈయన ఆర్చగలడా, తీర్చగలడా? గత జలసేతు బంధనమే అవుతుంది. ముందు, వచ్చిన పని పూర్తి చేసుకోవటం ముఖ్యం. అందుకనే, "నా కో టెలిఫోన్ అప్లికేషన్ కావాలి. సంబంధిత సీటు ఖాళీగా ఉంది'' అన్నాను ఆంగ్లంలో.

క్షణకాలమైనా ఆలోచించలే దతను. "పోస్టలార్డర్ మీద మీ పేరు, చిరునామా రాసిచ్చి వెళ్లండి. అప్లికేషన్ పోస్టులో పంపిస్తాం'' అనేశాడు.

ఇంకేముంది? నే నొచ్చిన పని అయిపోయింది. అప్లికేషన్ ఇవ్వాల్సిన గుమస్తా లేడు కనక మళ్లీ రమ్మంటే, "ఎన్నిసార్లు తిరగాలి?' అని ప్రశ్నించే అవకాశం నాకుండి ఉండేది. కానీ పోస్టులో ఇంటికే పంపిస్తాం అన్నాక ఇంకేమనగలను? నా నోరు కట్టుబడిపోయింది. సమస్యను సులువుగా పరిష్కరించే నేర్పు కొంతమందికే ఉంటుంది. అందుకు ఎంతో సమయస్ఫూర్తి కావాలి. ఇతగాడు సమర్థుడైన ఆఫీసర్ అనిపించుకున్నాడు.

వచ్చిన పని పూర్తయింది. ఆఫీసర్ మర్యాద తెలిసిన మనిషే కనుక అయనకి మర్యాద పాఠం చెప్పాల్సిన అవసరం లేదు. అయితే, వెళ్లబోయే ముందు ఒక సూచన చెయ్యడం మాత్రం అప్రస్తుతం కాదనిపించింది.

"పోస్టాఫీసులో స్టాంపులు అమ్మబడును, సేవింగ్సు ఖాతాలు, రిజిస్ట్రేషను, మనీ ఆర్డర్లు అంటూ ప్రతి కౌంటరు ముందూ రాసిఇ ఉంటుంది. బాంకుల్లో కూడా ఇలాంటి ఏర్పాటు ఉంటుంది. దాని వల్ల కస్టమర్లకు కొంత ఇబ్బంది తగ్గుతుంది. మీ ఆఫీసులో కూడా అలాంటి ఏర్పాటు చేస్తే బావుంటుందని నా మనవి. కౌంటర్లే ఏర్పాటు చెయ్యక్కర్లేదు. అట్ట ముక్కల మీద పెద్దక్షరాలతో రాయించి ఆ యా సీట్ల వెనక గోడల కంటించేస్తే సరిపోతుంది. అందుకు ఖర్చేమీ కాదు కనుక మీకు అభ్యంతరం ఉండదనుకుంటాను. ఇవ్వాళ అప్లికేషన్ ఎవరిస్తారో తెలుసుకోవటం ఓ ప్రహసనమైపోయింది. పూర్తి చేసిన అప్లికేషన్ ఎవరి కివ్వాలో తెలుసుకోవటం మరో ప్రహసనం కాకుండా ఉండాలంటే ఇలాంటి ఏర్పాటు తప్పనిసరి అని నేను భావిస్తాను. తర్వాత మీ దయ.'' అన్నాను.

ఆఫీసర్ వెంటనే ప్రతి స్పందించాడు. " మీ సూచన బావుంది. ఈ రోజే ఆ పని చేయిస్తాను' ' అన్నాడు.

"కృతజ్ఞుణ్ణి'' అని చెప్పి లేచి వచ్చేశాను.

●

